జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



# ప్రయాణికుల ప్రాణాలతో.. శ్యామోలి చెలగాటం!




**విశాఖపట్నం/అమరావతి, ఏప్రిల్ 13 (వార్త):** తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు వరుసగా అగ్నిప్రమాదాలకు గురవుతూ, ప్రయాణీకులను సజీవ దహనం చేస్తున్న ఘటనలు గుండెల్ని పిండేస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు జరిగిన ఘోర ప్రమాదాల్లో పదుల సంఖ్యలో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయినా, పొరుగు రాష్ట్రాల ప్రైవేటు బస్సుల 'మాఫియా' తీరులో మాత్రం మార్పు రావడం లేదు. నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల కళ్లు గప్పి రోడ్లపై తిరుగుతున్న ఈ మృత్యు శకటాలు ఎప్పుడు ఎవరి ప్రాణాలను బలి తీసుకుంటాయో తెలియక ప్రయాణీకులు వణికిపోతున్నారు. తాజాగా 'శ్యామొలి పరివాహన్' వంటి సంస్థలు అధిక లాభాల కోసం బస్సుల నిర్మాణాన్ని అడ్డగోలుగా మార్చివేస్తూ, కనీస భద్రతా ప్రమాణాలను విస్మరిస్తూ సాగిస్తున్న బాగోతం వెలుగులోకి రావడం సంచలనం రేపుతోంది. అదనపు సీట్ల కోసం చేసే అక్రమ మార్పులు, అత్యవసర ద్వారాల లేమి వెరసి ప్రయాణీకుల ప్రయాణాన్ని చావు అంచుల్లోకి నెట్టేస్తున్నాయి. శ్యామొలి పరివాహన్' ట్రావెల్స్ మాఫియా లాభార్జనే ధ్యేయంగా సామాన్య ప్రయాణీకుల ప్రాణాలను పణంగా పెడుతోంది. లగ్జరీ సర్వీసుల పేరుతో అధిక ధరలు వసూలు చేస్తూ, మరోవైపు బస్సుల నిర్మాణంలో కనీస భద్రతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. ముఖ్యంగా 'శ్యామొలి' సంస్థ నిర్వహిస్తున్న వోల్వో మల్టీ-యాక్సిల్ బస్సుల్లో జరుగుతున్న అడ్డగోలు ఉల్లంఘనలపై 'ఏపీ/ తెలంగాణ బస్ ఓనర్స్ అసోసియేషన్' విజయవాడ రవాణా శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది.


ఉల్లంఘనల పర్వం ఇదీ..

**అసోసియేషన్ తన ఫిర్యాదులో పేర్కొన్న ప్రధాన అంశాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి:**

## అదనపు సీట్ల దందా..

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ నిబంధనల ప్రకారం వోల్వో 9600 శ్రేణి బస్సుల్లో కేవలం 40 స్లీపర్ బర్త్‌లకు మాత్రమే అనుమతి ఉంటుంది. కానీ, ఈ సంస్థ ప్రైవేట్ బాడీ బిల్డర్ల ద్వారా బస్సు లోపలి అమరికను మార్చి, సీట్లు మరియు స్లీపర్లను కలిపి ఏకంగా 58 మంది పట్టేలా మార్పులు చేసింది.

*** నిబంధనలకు విరుద్ధంగా బస్సుల్లో అడ్డగోలు మార్పులు * 40 సీట్ల బస్సులో 58 మంది కుక్కుడు**
*** భద్రతా ప్రమాణాలు శూన్యం * నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రవాణా శాఖాధికారులు**
*** నిబంధనలు 'బేఖాతర్' * ప్రయాణీకుల ప్రాణాలు 'గాలిలో దీపం'!**




## మృత్యు పాశాలుగా ఎమర్జెన్సీ ఎగ్జిట్లు..

58 మంది ప్రయాణించే ఈ భారీ బస్సుల్లో అత్యవసర సమయంలో బయటపడేందుకు కేవలం కుడి వైపున ఒకే ఒక ద్వారం ఉండటం గమనార్హం. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే ప్రయాణీకులు సజీవ దహనం అయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టార్గెట్ బస్సులు ఇవే..

ఈ ఉల్లంఘనలకు పాల్పడుతున్న OB20D2548, OD20F2589, OD18N5897, TN11E4789 వంటి నంబర్ల గల బస్సులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. గంటకు 120 కిలోమీటర్ల వేగ పరిమితిని మించి ఈ బస్సులు ప్రయాణిస్తున్నాయని, దీనికి సంబంధించిన ఆధారాలు కూడా తమ వద్ద ఉన్నాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## మామూళ్ల మత్తులో నిఘా నేత్రం..

రాష్ట్ర సరిహద్దులు దాటి వందల కిలోమీటర్ల మేర ఈ మృత్యు శకటాలు యథేచ్ఛగా తిరుగుతున్నా రవాణా శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సీటింగ్ సామర్థ్యాన్ని పెంచినా, పర్మిట్ నిబంధనలను తుంగలో తొక్కినా చెక్ పోస్టుల వద్ద అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. గతంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోకుండా, ఇప్పటికీ మామూళ్ల మత్తులో జోగుతూ తనిఖీలను గాలికొదిలేయడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రైవేట్ ఆపరేటర్ల కాసుల కక్కుర్తికి అధికారులు వత్తాసు పలుకుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని ఈ 'దందా'పై ఉక్కుపాదం మోపకపోతే రేపు జరగబోయే అనర్థాలకు రవాణా శాఖాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

# వెంకన్న ఆశీస్సులతో.. కల నెరవేరింది!




*** సిక్కోలు చరిత్రలో నూతన అధ్యాయానికి శ్రీకారం**
*** త్వరలో హైదరాబాద్‌కు ఇక్కడి నుంచి రైలు * భవిష్యత్‌లో మరిన్ని సర్వీసులు చేరువ చేస్తాం**
*** కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**
*** శ్రీకాకుళం రోడ్డు నుంచి హంసఫర్ రైలు ప్రారంభోత్సవం**
*** శ్రీకాకుళం నుండి ఆమదాలవలస వరకు భారీ బైక్ ర్యాలీ**

**శ్రీకాకుళం, ఏప్రిల్13 (వార్త):** వెంకన్న ఆశీస్సులతో తన కల నెరవేరిందని, శ్రీకాకుళం జిల్లా చరిత్రలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టామని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లో శ్రీకాకుళం రోడ్డు నుండి తిరుపతి హంసఫర్ రైలును పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, డీఆర్ఎం లలిత్ బోహ్రాతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు శ్రీకాకుళం నగరంలోని తన క్యాంప్ కార్యాలయం నుండి ఆమదాలవలస రైల్వే స్టేషన్ వరకు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో జరిగిన భారీ బైక్ ర్యాలీలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. శ్రీకాకుళం నగరంలో క్యాంప్ కార్యాలయం, బలగ, కొత్తరోడ్డు కూడలి, రాగోలు, చింతాడ తదితర ప్రాంతాల్లో కేంద్రమంత్రికి ప్రజలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు చేరుకున్న మంత్రి హంసఫర్ రైలు ఎక్కి ప్రయాణికులతో ముచ్చటించారు. అనంతరం రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. 75 ఏళ్ల సిక్కోలు చరిత్రలో ఇలాంటి రోజు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నామన్నారు. తాను పార్లమెంటు సభ్యునిగా అడుగు పెట్టిన మొదటి రోజు నుండి ఇదే లక్ష్యాని ఎంచుకుని.. తీవ్ర స్థాయి ప్రయత్నాలను ప్రారంభించానని తెలిపారు. ఎన్నో సమావేశాల్లో ఇదే విషయం మాట్లాడానని, ప్రతీ రైల్వే మంత్రిని కలసి అవసరాన్ని ఒకటికి రెండుసార్లు గుర్తు చేశానన్నారు. వెంకన్న ఆశీస్సులు ఉన్నాయి కాబట్టే ఇది సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్‌కు సైతం ఇక్కడి నుండే రైలు ప్రారంభం అయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. హంసఫర్ రైలు విషయంలో మూడు రోజుల క్రితం బుకింగ్స్ ప్రారంభిస్తే 97 శాతం సీట్లు రిజర్వు అవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఒకప్పుడు ఉత్తరాంధ్రలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుండి బుక్ చేస్తే కేవలం కొంత కోటా మాత్రమే శ్రీకాకుళం కు అందుబాటులో ఉండేదని.. ఇకపై 1400 సీట్లలో 80 శాతం సీట్లు మన జిల్లాకు కేటాయింపు జరగనున్నాయని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఇది సిక్కోలు ప్రజల సౌకర్యం కోసం తెచ్చిన రైలు కాదని.. ఇది.. జిల్లా ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవనుందన్నారు. అన్నీ జిల్లాల కన్నా మనమేమీ తక్కువ కాదని చూపేలా.. రేపు.. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మీదుగా మన జిల్లా పేరును తనపై వేసుకుని రైలు మోసుకుని పోతూ ఉంటే.. చాలా గర్వంగా ఉంటుందన్నారు. ప్రధాని మోడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. ఇలా అందరి ఆలోచనలు జిల్లా ప్రగతిపై సమష్టిగా ఉన్నాయని.. ఆంధ్రప్రదేశ్‌కు ముఖద్వారంగా శ్రీకాకుళం చేయాలని వారి ఆలోచన అని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ప్రపంచంలో, దేశంలో ఎక్కడికి వెళ్ళినా సిక్కోలు ప్రజలు మనకు కనిపిస్తారని.. పొట్టకూటి కోసం వెళ్ళే పరిస్థితులు మారి.. జిల్లాలోనే వారికి ఉపాధి లభించేలా చేయాలనేది తన సంకల్పం అని తెలిపారు. మూలపేట పోర్టు, ఎయిర్ పోర్ట్, జాతీయ రహదారులు, రైల్వేలు, ఇలా అన్నీ రంగాలను అభివృద్ధి చేసుకుంటూ లాజిస్టిక్ హబ్‌గా వృద్ధిలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా తనకు ప్రధాని మోడీ స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారని.. రానున్న అయిదేళ్లలో ఏభై ఎయిర్పోర్టు నిర్మిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశం మొత్తం ఎయిర్పోర్ట్‌లు నిర్మించే తాను.. శ్రీకాకుళంలో సైతం నిర్మిస్తామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో రైల్వేల అభివృద్ధి కోసం తాను, కూన రవికుమార్ గతంలో అలుపెరగని పోరాటం చేసేవాళ్ళమని, పోరాడాం, ఎదుర్కొన్నాం, నిలబడ్డాం, అభివృద్ధి సాధించామని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఉద్దాన ప్రాంతంలోని ఏడు స్టేషన్లను విశాఖ రైల్వే జోన్‌లోకి తీసుకువచ్చామని అన్నారు. నూతనంగా ప్రారంభమైన ఈ రైలును అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమదాలవలస రైల్వే స్టేషన్‌లో 35 కోట్ల రూపాయలతో నూతన టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణంలో ఉందని, చింతాడ నుండి రైల్వే స్టేషన్‌కు 70 అడుగుల రహదారి త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చి.. మరిన్ని వసతులు చేరువ చేస్తామన్నారు. రెండు లైన్లను.. నాలుగు లైన్లగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఉన్న రైల్వే ట్రాక్‌లను రానున్న రెండేళ్ళల్లో మూడు లైన్లుగా మార్చుతామని రైల్వే మంత్రి హామీ ఇచ్చారన్నారు. రైల్వే అంటే.. గతంలో గుర్తుకువచ్చే పేరు కింజరాపు ఎర్రంనాయుడు అని తెలిపిన రామ్మోహన్ నాయుడు.. రైల్వే స్టాండింగ్ కమిటి సభ్యులుగా తన తండ్రి.. జిల్లాలో రైల్వే ఉన్నతికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్టు స్పష్టం చేశారు. నౌపాడ గుణుపూర్ లైన్‌ను అభివృద్ధి చేసిన ఘనత ఆయనదేనని గుర్తు చేశారు. శ్రీకాకుళం తిరుపతి హంసఫర్ రైలును అందరూ వినియోగించి.. 100 శాతం అక్యుపెన్సి తీసుకురావాలని అన్నారు. ఇలా అయితే వారానికి మరిన్ని రోజులు సర్వీసు కోరే విధంగా రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌పై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్టేషన్‌కు రెండు వైపులా ప్రవేశం ఉండేలా సుడాతో ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. ప్రవేశాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆమదాలవలస శాసన సభ్యులు కూన రవి కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సాధించని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం సాధించిందన్నారు. విశాఖలో రైల్వే జోన్‌కు వంద ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇందుకు కేంద్ర మంత్రి రామోహన్ నాయుడు కృషి ఫలితమేనన్నారు. ఇచ్ఛాపురం నుండి విశాఖపట్నం వరకు గల రైల్వే స్టేషన్లను విశాఖపట్నం రైల్వే జోన్ లోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈస్ట్ కోస్ట్ జోన్‌లో ఉన్న స్టేషన్‌లను విశాఖపట్నం రైల్వే జోన్ లో పెట్టినట్లు చెప్పారు. రైల్వే జోన్ వలన ఉత్తరాంధ్రకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైల్ వేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ట్రైన్లు వస్తాయన్నారు. పొందూరులో హాల్ట్ ఉండాలని డిఆర్ఎంను కోరారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం నుండి తిరుపతికి హంసాఫర్ ఎక్స్ ప్రెస్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఎం లలిత్, మాజీ ఎంఎల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, కూటమి నాయకులు, రైల్వే అధికారులు, పాల్గొన్నారు.

## ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**మందస, ఏప్రిల్ 13(వార్త):** ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఏ గౌతు శిరీషా అన్నారు. పిడిమందసలో పల్లె పండగ వారోత్సవాలలో భాగంగా ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన సుమారు రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డును గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిరీష మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతీ గ్రామానికి ప్రభుత్వ ఫలాలను అందించడమే కర్తవ్యమన్నారు. ఇకపై ఈ గ్రామ ప్రజలు రవాణా కష్టాలు లేకుండా తమ పనులను సులభంగా చేసుకోగలుగుతారన్నారు. తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు, తెలుగుదేశం ప్రభుత్వానికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, కార్యదర్శి సాలిని మాధవరావు, గ్రంథాలయ చైర్మన్ పీరికట్ల విఠల్ రావు, మండల ఇతర నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

### -ఎమ్మెల్యే కూన రవికుమార్

**పొందూరు, ఏప్రిల్ 13(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న ఆధునిక వసతులను ప్రజల్లోకి తీసుకెళ్లి, అడ్మిషన్ల శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పొందూరులోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో అడ్మిషన్ల పెంపు, నూతన విద్యా విధానంపై నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో ప్రైవేటుకు దీటుగా ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్యాబోధన, అత్యాధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ ప్రారంభం



**మందస, ఏప్రిల్ 13(వార్త):** లోహరిబందకొత్తూరులో జిల్లా స్థాయి కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ ప్రారంభమయ్యింది. తెలుగుదేశం పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయ కర్త వెంకన్నచౌదరి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, కార్యదర్శి సాలిన మాధవరావు, దాసరి తాతా రావు, ముంజేటి చంద్రశేఖర్, బమ్మిడి కర్రయ్య, నవీన్ యాదవ్, అడ్డి ఈశ్వరరావు, ఔగాన ఈశ్వరరావు, హరీష్ గొర్లె, అడ్డి దండాసి, పులారి సిద్దు తదితర ముఖ్య నాయ కులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఎస్వీఎస్ఎస్ ఆర్థిక సాయం



**మందస, ఏప్రిల్ 13(వార్త):** సువర్ణాపురంనకు చెందిన ఇప్పిలి నాగేశ్వరరావు, నోములమ్మ దంప తుల పెద్ద కుమారుడు గగన్ సికి ల్సెల్ అనీమియా అనే వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో పేద కుటుంబమైన వీరికి పెద్ద కష్టం వచ్చింది. గగన్ వైద్యానికి రూ.లక్షలు అవసరం. ఈ విష యం తెలుసుకున్న స్వామి వివేకానంద సేవాసమితి ప్రతినిధులు దాతల సహకారంతో రూ.20,000ల ఆర్థిక సహాయం అందజేశారు.

## తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో గొల్లవూరు బాలిక సత్తా



**సోంపేట ఏప్రిల్ 13 (వార్త):** గొల్లవూరు పంచాయతీ దామోదర్ పురం గ్రామానికి చెందిన మల్లెన తేజేశ్వరరావు కుమార్తె నవ్య తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో 990 మార్కులు సాధించి సత్తా చాటుకుంది. తండ్రి ఉద్యోగ రీత్యా తెలంగాణలో పనిచేయడంతో ఆ కుటుంబం అక్కడే ఉంటూ తమ పిల్లలను చదివిస్తున్నారు. నవ్య ఎంపీసీ విభాగంలో మంచి ప్రతిభ సాధించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. నవ్య కుటుంబీ కులతో పాటు స్వగ్రామంలో అందరూ సంతోషం వ్యక్తం చేశారు.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని గ్రామస్తులు కోరుకున్నారు.

## సరస్వతీదేవి విగ్రహ స్థాపనకు భూమి పూజ



**సారవకోట, ఏప్రిల్ 13(వార్త):** సారవకోట ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ స్థాపనకు సంబంధించి భూమి పూజ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయుడు రామచంద్రుడు తెలిపారు. పాఠశాల ఆవరణలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంటూ, త్వరలోనే ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. విద్యాదేవతగా భావించే సరస్వతి దేవి విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆధ్యాత్మికత, విద్యాపట్ల ఆసక్తి పెరుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. స్థానిక వాసి రవికుమార్ ఈ విగ్రహాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

## జోనంకి పాఠశాలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



**జలుమూరు, ఏప్రిల్ 13 (వార్త):** జోనంకి పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి మాధవరావు సోమవారం సందర్శించి పాఠశాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల రికార్డులను సమీక్షించారు. పాఠశాలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరవుతూ బోధనపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు అక్షరాలు అందంగా రాయడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. ఈ సందర్శన ద్వారా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పాఠశాలలలో బోధన, పరిశుభ్రత, విద్యార్థుల అభివృద్ధిపై సమగ్ర దృష్టి అవసరమని ఈ తనిఖీ చెస్తూ స్పష్టం చేశారు.

## రోటరీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13 (వార్త):** రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సోమవారం నుండి 24 రోజుల వరకు జరుగును, ఇందుకు గాను రోజుకు 2000 చొప్పున 24 రోజుల కు గాను 48,000/ వేల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు రోటరీ క్లబ్ అఫ్ ఇచ్ఛాపురం తెలియజేశారు, ఈ మొత్తం 48,000 రూపాయలు ను క్లబ్ మెంబెర్స్ డొనేట్ చేశారన్నారు. ప్రాజెక్టు చైర్మన్ కే.రామారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కార్యక్రమమని ముందుకు తీసుకెళ్ళారని చెప్పారు.



## అంగన్‌వాడీల్లో 8వ పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు



**మందస, ఏప్రిల్ 13(వార్త):** అంగన్ వాడీ కేంద్రాల్లో 8వ పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహించాలని, కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పెద్దింటి అరుణ అన్నారు. మందసలోని ఐసీడీఎస్ కార్యాలయం జరిగిన సమావేశంలో అరుణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ 8వ పోషణ్ పక్వాడా అవగాహన పక్షోత్స వాల కార్యక్రమంలో భాగస్వాములై, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆరోగ్యకరమైన అలవాట్లను అలవచుకోవాలన్నారు. 8వ పోషణ్ పక్వాడా అవగాహన పక్ష ఉత్సవాల ముఖ్య అంశాలను వివరించారు. ఈ నెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించబడతాయి. మొదటి ఆరు ఏళ్లలో మెదడు అభివృద్ధిని పెంపొందించడం అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం సాగనుంది. ఈ ఏడాది గర్భధారణ సమయం నుంచి శిశువు పెంపకం వరకు తండ్రుల పాత్రను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా ఈ 15 రోజుల పాటు వివిధ థీమ్‌ల ఆధారంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గర్భిణీ స్త్రీలు, శిశువుల పోషణపై "సుపోషిత జనని, స్వస్థ శిశు" పేరిట అవగాహన సదస్సులు, తండ్రులకు పోషకాహార తయారీ పోటీలు, చిరుధాన్యాలు వంటి సంప్రదాయ ఆహారం వైపు మళ్లించేలా ప్రదర్శనలు, "స్వాప్ ది స్నాక్" ఎగ్జిబిషన్లు, 3 నుంచి 6 ఏళ్ల పిల్లల కోసం "ఖేల్-సే-సీఖ్" కార్నివాల్, తండ్రుల కోసం ప్రత్యేక స్టోరీ టెల్లింగ్ సెషన్లు, పెద్దల కోసం పోషణ, మెదడు అభివృద్ధి అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**నరసన్నపేట, ఏప్రిల్ 13 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన కనీస సామగ్రి అందించాలని కోరుతూ కార్మికులు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలు గత కొన్నేళ్లుగా పట్టించుకోకపోవడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో భాగంగా చీపుర్లు, మాస్కులు, బూట్లు వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ, తమ పనిలో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో తమ సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కె.వి. ప్రసాదరావు మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అవసరమైన సామగ్రి అందించే చర్యలు తీసుకుంటామని, వేతనాలు సమయానికి అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వేతనాల విషయంలో ఎటువంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని, సమస్యలు కొనసాగితే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యలపై అధికారులు స్పందించడం సానుకూల పరిణామంగా భావించబడుతుండగా, హామీలు అమలులోకి వస్తాయా అన్నది కార్మికులు ఎదురుచూస్తున్నారు.

## యువ న్యాయవాది హత్యపై లాయర్ల ఆగ్రహం



**నరసన్నపేట, ఏప్రిల్ 13 (వార్త):** విశాఖ జిల్లా సీలేరు ప్రాంతంలో యువ న్యాయవాది పూజారి ఎల్లయ్య హత్యకు నిరసనగా న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ న్యాయవాదుల సంఘం స్పందించింది. సోమవారం నరసన్నపేట మున్సిపల్ మెజిస్ట్రేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు మాట్లాడుతూ, న్యాయవాది హత్య వంటి ఘటనలు తీవ్రంగా ఖండించాల్సినవని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో తక్షణమే స్పందించి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే, న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసనలో భాగంగా న్యాయవాదులు విధులను బహిష్కరించి తమ ఐక్యతను చాటుకున్నారు. న్యాయవాది హత్య ఘటనపై న్యాయవాదుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుండగా, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

## పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్త్రీ శక్తి విజయవంతం




**పలాస, ఏప్రిల్ 13 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం స్త్రీ శక్తి కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల మహిళా సాధికార విభాగం (డబ్ల్యూఈసీ) ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకట లక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ స్వాతంత్ర్యం కోసం 'మిషన్ శక్తి', 'ముద్ర యోజన', 'బేటీ బచావో - బేటీ పడావో' వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం, మహిళా కమండర్స్ ఆపరేషన్ సిందూర్ ముందుకు నడిపించి విజయం సాధించారని చెప్పారు. నేటి మహిళలు ఎలా దూసుకుపోతున్నారో అనే విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ విభగ ఇన్చార్జ్ బి. నరసింహులు, ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ పి వెంకటరమణ, డబ్ల్యూఈసి కో-ఆర్డ్ నేటర్ డా. కె. గిరిజ, మహిళా శక్తి గురించి వివరించారు. ఫిఫిజికల్ డైరెక్టర్ డా. పి మధు, స్త్రీ శక్తి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణలో చెత్త కుప్పలు




**సారవకోట, ఏప్రిల్ 13 (వార్త):** అలుదు ప్రాథమిక పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త కుప్పలు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. పాఠశాల రక్షణ గోడ పక్కనే వ్యర్థాలను వేయడం వల్ల దుర్వాసన వ్యాపిస్తూ, విద్యార్థుల ఆరో గ్యంపై ప్రభావం పడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుప్పల వద్ద పందులు, కుక్కలు సంచరిస్తుండటంతో చిన్నారులు భయాందోళనలకు గురవుతు న్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు అసౌకర్యంగా భావిస్తూ, చదువుపై దృష్టి సారించలేకపోతున్నారని తెలిపారు. జమ్మవరం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ సమస్య స్థానికంగా పెద్ద ఇబ్బందిగా మారింది. రోజువారీగా ప్రజలు, విద్యార్థులు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగించాల్సి వస్తున్నందున పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చెత్తను తొలగించి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడడం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు.

## వడదెబ్బపై అప్రమత్తం



**సారవకోట, ఏప్రిల్ 13 (వార్త):** వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సారవకోట పీహెచ్సీ వైద్యులు సుధారాణి సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున ఆరుబయట పని చేసే వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఉపాధి వేతనదారులు, రైతులు, భవన నిర్మాణ కార్మికులు వంటి వారు ఉదయం వేళల్లోనే పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నం ఎండల్లో బయట తిరగకుండా ఉండాలని సూచించారు. అవసరమైతే మాత్రమే బయటకు వెళ్లాలని హెచ్చరించారు. అలాగే శరీరంలో నీరు కొరత రాకుండా తరచుగా తాగునీరు తీసుకోవాలని, తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిదని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా సరైన జాగ్రత్తలు పాటించడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు తెలిపారు.

## రాగుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**నరసన్నపేట, ఏప్రిల్ 13 (వార్త):** తామరపల్లి రైతు సేవా కేంద్రంలో రాగుల కొనుగోలు కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారిణి సూర్య కుమారి తెలిపారు. సోమవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ, రాగులు పండించే రైతులకు మద్దతుగా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ప్రారంభించిందని వివరించారు. 2025--26 సంవత్సరానికి గాను మొత్తం 1,500 టన్నుల రాగుల సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు తమ పంటలను సరైన ధరకు విక్రయించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు తమ సమీపంలోని సచివాలయాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి రాగులను విక్రయించవచ్చని సూచించారు. ధాన్యం కొనుగోలు విధానంలాగే గోనె సంచులు, రవాణా ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పంటలను ప్రభుత్వానికి విక్రయించాలని అధికారిణి కోరారు. రాగుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు రైతులకు మద్దతు ధర కల్పిస్తూ, వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌లో కీలక పాత్ర పోషించనుంది.

## బీసీల సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం

**కొత్తూరు, ఏప్రిల్ 13 (వార్త):** రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలను సామాజికంగా, రాజకీయంగా అగ్రస్థానంలో నిలిపిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ పి.ఏ.సి.ఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ స్పష్టం చేశారు. సోమవారం కొత్తూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల పాలనలో బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా రాష్ట్రానికే వెన్నెముకగా గుర్తించి, వారికి రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించారని కొనియాడారు. 130 బీసీ కులాలకు ప్రత్యేక గుర్తింపునిస్తూ 57 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం జగన్ పాలనలోనే సాధ్యమైందని ఆయన గుర్తు చేశారు. మంత్రివర్గ విస్తరణలో సైతం సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చిన జగన్, గతంలో 25 మంది మంత్రులలో 11 మంది బీసీలకే అవకాశం ఇచ్చి వారి పట్ల తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని సూర్యనారాయణ పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బీసీలకు ప్రాధాన్యత తగ్గడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 50 శాతం ఉన్న మహిళా రిజర్వేషన్లను ప్రస్తుత ప్రభుత్వం 33 శాతానికి తగ్గించడం అన్యాయమని విమర్శించారు. నేడు మంత్రివర్గంలో బీసీల సంఖ్య కేవలం ఎనిమిదికి పరిమితం కావడం ఆ వర్గాల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపును సూచిస్తోందని మండిపడ్డారు. బీసీల ప్రయోజనాలకు ఎక్కడ విఘాతం కలిగినా వైఎస్ఆర్‌సీపీ అండగా నిలుస్తుందని, వారి హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతామని ఆయన హెచ్చరించారు. రాజ్యసభ నుంచి స్థానిక సంస్థల వరకు బీసీలకు పెద్దపీట వేసిన చరిత్ర తమ పార్టీదని, ఆ నిబద్ధతతోనే ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కొత్తూరు ఎంపీపీ సవర సావిత్రి, జడ్పీటీసీ కామక భాగ్యవతి, మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, నిమ్మగడ్డ కృష్ణమూర్తి, బాలకృష్ణ , నాగేంద్ర, ధర్మారావు సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వేతనాల కోసం వీవోఏల వినతి

**సోంపేట, ఏప్రిల్ 13(వార్త):** ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మూడు నెలల పాటు ప్రభుత్వం నుంచి వేతనాలు అందకపోవడంతో వెలుగు డిపార్ట్మెంట్లో క్షేత్రస్థాయిలో కీలకమైన విధులు నిర్వహిస్తున్న వివోఏలు సోమవారం సిఐటియు ప్రతినిధులతో కలిసి తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని డిప్యూటీ తాసిల్దారు ఉమామహేశ్వరరావుకు అందజేశారు. బహిరంగ మార్కెట్లో నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి కుటుంబ నిర్వహణ భారంగా మారిందని ఈ నేపథ్యంలో వేతన బకాయిలతో కుటుంబాలు నెట్టుకు రావడం చాలా కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రతినిధి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, ఏప్రిల్ 13 (వార్త):** రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. సూర్యఘర్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. సోమవారం సూర్యఘర్ పథకంలో భాగంగా పలాస మండలం గంగువాడ గ్రామంలో పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజనను ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతి పథకం ప్రజలకు ఎంతో మేలు చేసేదిగా ఉంటున్నాయని పేర్కొన్నారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ ఎస్టీ గృహాలపై రెండు కిలోవాట్ల సౌకర్యం కలిగిన సౌర విద్యుత్ ఫలకాలను ఉచితంగా అమర్చడం జరుగుతుందని చెప్పారు. దీని ద్వారా 240 యూనిట్లు కరెంటు ఉత్పత్తి అవుతుందని, ఈ వర్గాలకు 300 యూనిట్లు వరకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుందని, సూర్యఘర్ లో ఉత్పత్తి అయ్యే మిగిలిన నలభై యూనిట్ల కరెంటును విద్యుత్ శాఖ తీసుకుని లబ్దిదారునికి చార్జీలు చెల్లిస్తుందని తెలిపారు. మిగిలిన వారు కూడా సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ప్రభుత్వం 78 వేల రూపాయల వరకు రాయితీ ఇస్తుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని వారికి వెసులుబాటు కల్పించే పథకాలకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయని చెప్పారు. ప్రతి ఒక్కరు సౌర విద్యుత్తును వినియోగించుకుంటే కరెంటును ఆదా చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠాల్, దువ్వాడ సంతోష్ కుమార్, ఎంపీడివో వసంత కుమార్, స్థానిక నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



**సారవకోట, ఏప్రిల్ 13(వార్త):** సైబర్ నేరాలు అధికంగా పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ గిరిధర్ సూచించారు. జలుమూరు మండలం లింగాలపాడు జడ్పీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల హెడ్మాస్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ భద్రతపై కీలక సూచనలు అందించారు. సెల్‌ఫోన్లకు వచ్చే అనుమానాస్పద మెసేజ్‌లు, తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని హెచ్చరించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు వంటి విషయాలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. ఆన్లైన్ మోసాల నుంచి రక్షించుకోవాలంటే జాగ్రత్తలు పాటించడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సైబర్ భద్రతపై అవగాహన పొందారు. పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా భద్రతను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

## మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ



**పలాస, ఏప్రిల్ 13 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పలాస గవర్నమెంట్ హై స్కూల్ లో మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం పాల్గొన్నారు. సందర్భంగా మాట్లాడుతూ భారతదేశానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత హాకీ ఆటగాడు; అతన్ని "హాకీ మాంత్రికుడు" (మేజిషియన్ ఆఫ్ హాకీ ) అని పిలుస్తారు. ఆయన జన్మదినమైన ఆగస్టు 29న భారతదేశంలో ప్రతి సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవం గా జరుపుకుంటారని తెలిపారు. ఆయన ఆట చూసి కొందరు ఆంగ్ల క్రీడాకారులు "హాకీ కర్రలో అయస్కాంతం ఉందా?" అని అడగాల్సినంతగా ఆటతీరు అద్భుతంగా ఉండేదని చెబుతారు. హిట్లర్ కాలంలో జర్మనీ ఆయనకు పౌరసత్వం, ఉన్నత ఉద్యోగం ఇస్తామని ప్రపోజల్ ఇచ్చినప్పటికీ, ఆయన "నేను భారతీయ సైనికుడిని, నేను భారత్ తరపునే ఆడుతాను" అంటూ తిరస్కరించాడని తెలిపారు. వాస్తవానికి మేజర్ ధ్యాన్ చంద్ భారత హాకీ గర్వం మాత్రమే కాదు, దేశభక్తి, సాధన, సామర్థ్యం కలిపిన ప్రతీకగా పరిగణిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే గ్రామాల్లో పాస్‌బుక్‌ల పంపిణీ




**జలుమూరు, ఏప్రిల్ 13 (వార్త):** జలుమూరు మండలంలో రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో పట్టాదారు పాస్‌బుక్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్రతి నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పాస్‌బుక్లను సరిచేసి రైతులకు అందించాలని జాయింట్ కలెక్టర్ (జేసీ) ఆదేశించారు. ఈరోజు అక్కురాడ గ్రామ సచివాలయంలో నిర్వహించిన పాస్‌బుక్ పంపిణీ కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు అందించే పాస్‌బుక్లలో ఎటువంటి తప్పులు లేకుండా సర్వే నంబర్, ఖాతా నంబర్, భూమి విస్తీర్ణం, రైతు పేరు, తండ్రి పేరు వంటి వివరాలను పూర్తిగా పరిశీలించి అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కొంతమంది రైతులు, సచివాలయ సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండడం లేదని, పనులు సరిగా చేయడం లేదని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జేసీ, సిబ్బందికి గట్టిగా హెచ్చరికలు జారీ చేస్తూ, ఇకపై ఇలాంటి ఫిర్యాదులు వస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఎమ్మార్వో జె. రామారావు మాట్లాడుతూ, పాస్‌బుక్లలో అన్ని వివరాలు సరిచూసి రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంపై దాడి.. ముద్దాయికి జైలు, జరిమానా

**మందస, ఏప్రిల్ 12(వార్త):** హెడ్ మాస్టర్ పై దాడి కేసులో ఓ ముద్దాయికి జైలు, జరిమానా విధించామని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెట్ట దామోదరరావు సరియాపల్లి ఎంపీయూపీ స్కూల్‌లో హెడ్ మాస్టర్‌గా విధుల్లో ఉండగా, 2020 నవంబరు రెండున ఉదయం 10 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన ముద్దాయి గస్య శ్రీనివాసరావు స్కూల్‌కి వచ్చి నాడు-నేడు పనుల బిల్లుల చెల్లింపులో ఎందుకు జాప్యం చేస్తున్నారని.. గొడవ పడి చెప్పుతో కొట్టారని, ఇటుకతో రెండు సార్లు దాడి చేసి, అవమానపరిచారు. దీనిపై అప్పటి మందస ఎస్ఐ బి.రామారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి, కోర్టులో చార్జి షీట్ ఫైల్ చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున ఎస్.నరేష్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి రూ.10వేల జరిమానా లేదా ఆరు నెలల సాధారణ కారాగార శిక్ష ఏజేఎంఎఫ్సీ కోర్టు సోంపేట జడ్జి కంచి శ్రీనివాసరావు విధించారని తెలిపారు. కోర్టుకానిస్టేబుల్‌గా టి.నేతాజీ వ్యవహరించారు.

## ధర్మాన సోదరులు, తమ్మినేనిని కలిసిన చింతాడ

**కొత్తూరు, ఏప్రిల్ 13 ( వార్త ) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన చింతాడ సూర్యనారాయణ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి ధర్మాన ప్రసాద రావును వారి క్యాంప్ కార్యాలయాల్లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ శుభసందర్భంగా నేతలకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు మండల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి



**పలాస, ఏప్రిల్ 13 (వార్త):** నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సుమారు రూ 12,65,743 విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసిందని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, ప్రజల కష్టాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని ప్రజలు ఇలానే ఆదరిస్తే భవిష్యత్తులో సీఎం చంద్రబాబు నాయుడు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలు ఆర్థికంగా అభివృద్ధికి తోడుగా నిలుస్తారన్నారు. తమకు కష్ట కాలంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన పలాస ఎమ్మెల్యే గౌత శిరీష కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కొత్తూరులో డీసీసీబీ శాఖ ఏర్పాటు చేయండి

### -చైర్మన్ శివ్వాల సూర్యనారాయణకు

### తులసీ వరప్రసాద్‌రావు విజ్ఞప్తి



**కొత్తూరు, ఏప్రిల్ 13(వార్త):** జిల్లాలో కీలక వాణిజ్య, వ్యవసాయ కేంద్రంగా విరాజిల్లుతున్న కొత్తూరు మండలంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) శాఖను తక్షణమే ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు కోరారు. సోమవారం శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తులసీ వరప్రసాద్ రావు మాట్లాడుతూ, జిల్లాలోనే అతిపెద్ద మండలాల్లో ఒకటిగా ఉన్న కొత్తూరులో జనాభా సాంద్రత అధికమని, ముఖ్యంగా వంశధార నిర్వాసితులు, గిరిజనులు మరియు రైతులు ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారని వివరించారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన వేలాది మంది రైతులకు, సామాన్య ప్రజలకు తగినన్ని బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల ఆర్థిక లావాదేవీల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కొత్తూరులో డీసీసీబీ శాఖను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు స్వల్పకాలిక రుణాలతో పాటు ప్రభుత్వ పథకాలు మరింత చేరువవుతాయని, ఇది ఆ ప్రాంత ఆర్థిక పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితిని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకు కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కోరారు. దీనిపై డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ సానుకూలంగా స్పందిస్తూ, కొత్తూరు ప్రాంత ప్రాముఖ్యతను గుర్తించామన్నారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్న తమ బ్యాంకు, కొత్తూరులో నూతన శాఖ ఏర్పాటుకు సంబంధించి ఉన్నతాధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదనపై చైర్మన్ సానుకూలంగా స్పందించడం పట్ల కొత్తూరు మండల రైతాంగం, వ్యాపార వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# గిరిజన పల్లెల్లో తాగునీటి కష్టాలు తీర్చాలి

**కొత్తూరు, ఏప్రిల్ 13 (వార్త):** గిరిజన గ్రామాల్లో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోమవారం అధికారులను ఆశ్రయించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, గిరిజన సంఘం నాయకులు కలోడియా ఆధ్వర్యంలో నాయకులు కొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నీరజ గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ, వేసవి తాపం పెరుగుతున్న కొద్దీ గిరిజన ప్రాంతాల్లో నీటి కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యంగా గొట్టిపల్లి పంచాయతీలోని ఉల్లిమాన్ గూడ, అడ్డంగి పంచాయతీ పరిధిలోని దాపాకులగూడ, ఎగువ మరియు దిగువ ముల్లేలుగూడ గ్రామాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. అలాగే కారి గూడ పంచాయతీలోని దిగువ దొండమాన్ గూడ, దిమిలి పంచాయతీలోని ఇప్పగూడ, బొడ్డ గూడతో పాటు పొంటూరు పంచాయతీలోని బంకిబంజారుగూడ, మెత్తుగూడ గ్రామాల్లో గిరిజనులు గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి, కొండలపై నివసిస్తున్న గిరిజనుల దాహార్తిని తీర్చాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే గిరిజనులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై ఎంపీడీఓ నీరజ గారు సానుకూలంగా స్పందిస్తూ, సమస్య తీవ్రత ఉన్న గ్రామాల్లో తక్షణమే సంబంధిత అధికారులతో సమీక్షించి, నీటి సరఫరా మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు రమేష్, రాము, సునీల్, పంజు, శీలా, జాన్సీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## జమ్మూ ప్రత్యేకాధికారిగా తహశీల్దార్



**నరసన్నపేట, ఏప్రిల్ 13 (వార్త):** జమ్మూ పంచాయతీ ప్రత్యేకాధికారిగా తహశీల్దార్ టి. సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ఆయనను ప్రత్యేకాధికారిగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పంచాయతీలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టి, గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. స్థానిక ప్రజల సహకారంతో పంచాయతీ అభివృద్ధిని సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ గ్రామాభివృద్ధి, సమస్యల పరిష్కారంపై దృష్టి సారించనున్నట్లు స్పష్టం చేశారు.

## ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా బారువ వాసి



**సోంపేట, ఏప్రిల్ 13(వార్త):** బారువకు చెందిన వి.దివాకర్‌రావు ఎల్ఐసీ విశాఖ పట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఎల్ఐసీలో అసిస్టెంట్‌గా ప్రస్థానం ప్రారంభించి వివిధ హోదాల్లో పనిచేశారు. విశాఖలో మార్కెటింగ్ మేనేజర్‌గా, సేల్స్ మేనేజర్‌గా, భద్రక్‌లో ఎల్ఐసి చీఫ్ మేనేజర్ గా విజయవంతంగా బాధ్యతలు నిర్వహించి తాజాగా విశాఖపట్నం డివిజన్‌లో సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా ఉన్నత స్థాయికి ఎదగడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నిరంతరం వృత్తిపై గౌరవం, కృషి, అంకితభావం, పట్టుదల ఆయనను ఎల్ఐసీలో ఉన్నతమైన హోదాను కట్టబెట్టాయని పలువురు పేర్కొన్నారు. ఒక మారుమూల గ్రామంలో జన్మించి ఉత్తమ కెరీర్ సాధించిన దివాకర్ రావు ఎందరికో స్ఫూర్తి అని పలువురు కొనియాడారు. ఆయనకు పదోన్నతిపై పలాస బ్రాంచ్ చీఫ్ మేనేజర్ టి.బి.సాయి, సోంపేట బ్రాంచ్ మేనేజర్ బి.వెంకటేష్ హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళా సాధికారతపై అవగాహన




**నరసన్నపేట, ఏప్రిల్ 13(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం "నారీ శక్తి - అది నియమం" అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని మహిళా సాధికారతపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ శాంతి హెమ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ మహిళా సాధికారతలో ఇంకా పూర్తిస్థాయి పురోగతి సాధించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మహిళల స్థాయిని మరింత బలపర్చేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యాపకులు అన్నాజీ రావు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించిందని, వాటిపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న వివక్ష, అన్యాయాలను సంఘటితంగా ఎదుర్కొని సమానత్వం సాధించాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ చర్చా కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మహిళా హక్కులు, సమానత్వం వంటి అంశాలపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## దేశానికి దిక్సూచి బాబాసాహెబ్ అంబేద్కర్



**పలాస, ఏప్రిల్ 13 (వార్త):** భారతరత్న, ప్రపంచ మేధావుల్లో ఒకరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాయడం భారతీయులకు గొప్ప వరమన్నారు. ఈ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయ పౌరుడుపై ఉందన్నారు. ఒకప్పుడు మన దేశానికి స్వాతంత్ర్యం రాకమునుపే మనువు సిద్ధాంతం ఉండేదని, ఆ రాజ్యాంగంలో మనుషులను మనుషులుగా గుర్తించకుండా హీనంగా చూసే రోజులలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 1948లో భారత రాజ్యాంగం రచించారన్నారు. భారత రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెలలు నిద్రాహారాలకు దూరంగా ఉండి అహర్నిశలు కృషిచేసి రాజ్యాంగ రచనకు అంకితమయ్యారని తెలిపారు. ధనిక, పేద, మత, వర్గ బేధం లేకుండా దేశ ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా భారత రాజ్యాంగాన్ని రచించారని ఆయన వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారని తెలిపారు. న్యాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో పురుషులతో సమానంగా స్త్రీలకు హక్కులు ఉండాలని 1951 ఫిబ్రవరి 5న హిందూ కోడ్ బిల్లు పార్లమెంట్లో పెట్టారని, బిల్లు వీగిపోవడంతో తన మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఉన్నత ఆశయాలతో జీవితాన్ని అంతా సమాజానికి అంకితం చేశారని కొనియాడారు. నేటికీ ఆయన ఆశయాలు పూర్తిగా నెరవేర లేకపోయాయని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకెళ్లాలని, ఆయన కన్న కలలను సాకారశీ అయ్యే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బమ్మిడి కోరారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నరసింహామూర్తి కుటుంబానికి పరామర్శ

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కేశవపట్నం వరాహ నరసింహమూర్తి మూర్తి ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఆయన చిత్రపటానికి వైస్సార్సీపీ నాయకులు నివాళులర్పించి కుటుంబానికి పరామర్శించి ఓదార్చారు.

నరసింహమూర్తి భార్య రాజులమ్మ, కుమారులు యుగందర్ (బాబ్జీ) హరినారాయణ (రాంజీ) అంజనీ కుమార్ (అంజి) కుటుంబ సభ్యులను సాంత్వన కలగించారు.మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు , ధర్మాన కృష్ణదాసు . పేరాడ తిలక్, చింతాడ రవి, సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్, మామిడి శ్రీకాంత్, ఎన్ని ధనుంజయ, పిలక రాజలక్ష్మి, కడియాల ప్రకాశ్, పిలక సంతు, నర్తు ప్రేమ్ కుమార్, దక్కత తిమ్మరుసు రెడ్డి, అనపాన శ్రీరాం, సాడి జయరాం తదితరులు పరామర్శించారు.



# పేద దళిత మహిళ దేవికి న్యాయం చేయాలి

### - దళిత సంఘాల డిమాండ్

**పలాస, ఏప్రిల్ 13 (వార్త):** సూది కొండ చెందిన పేద దళిత మహిళ దేవికి న్యాయం చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండలో పేద దళిత మహిళ దేవికి సంబందించిన గూడును అన్యాయంగా కూల్చివేశారని, ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని ఆమెకు న్యాయం చేయాలని వైసీపీ పట్టణ అధ్యక్షులు సిస్టు. గోపి ఆధ్వర్యంలో దళిత మహిళలు, నాయకులు పలాస ఆర్. డి. ఓ కార్యాలయంలో డిటి సునందకు వినతి పత్రం అందించారు. సర్వే నంబర్ 49లో, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిరుపేద మహిళ కింతాడ దేవి కాయ కష్టం చేసి పైసా పైసా కూడబెట్టి ఇల్లు నిర్మాణం చేపడుతోందని, ఈ నిర్మాణాము అక్రమమంటూ ఆలయ కమిటీ ఫిర్యాదుతో ఎటువంటి నోటీసులు అందించకుండా మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు పోలీసులు భద్రత నడుమ జేసీబీతో నిర్మాణాన్ని కూల్చివేశారని మండిపడ్డారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలం యొక్క పత్రాలు చూపిస్తానని వేడుకున్నా అధికారులు కనికరం చూపలేదని, బాధితురాలకు భర్త లేని ఒంటరి మహిళగా, అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారితో జీవనం సాగిస్తున్న ఆమె ఇప్పుడు రోడ్డున పడిందని తెలిపారు. సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు ఖర్చు చేసి కట్టుకున్న గూడు క్షణాల్లో మట్టిపాలు కావడంతో ఆమె ఆత్మ హత్యకు పాల్పడిందని వివరించారు. జంట పట్టణాలలో అనేక చోట్ల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించు కొని అధికారులు ఒక పేద మహిళ గూడు కూల్చివేత మాత్రం వేగంగా జరగడం అధికారుల ద్వంద్వ వైఖరిని బయటపెడుతోందని మండిపడుతున్నారు. ఆమెకు న్యాయం చేయకపోతే దళిత సంఘాలు తో కలిసి వైసీపీ అండగా నిలుస్తూ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్. పి స్పందించి బాధితురాలికి న్యాయంచేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ ఎస్సీ సెల్ పలాస నియోజకవర్గం అధ్యక్షుడు వాయిలపల్లి.శ్రీనివాస్, వైస్సార్సీపీ 19వ వార్డు అధ్యక్షుడు బగాది.సింహాచలం, స్థానిక సూదికొండ అంబేద్కర్ నగర్ దళిత సంఘాల నాయకులు దుమ్ము.రాజు, తోట.సిమ్మయ్య, దేవాది.బుడ్డు, జగన్, తోట.రమణమ్మ, తోట.పున్నమ్మ, తోట.మంగమ్మ, దేవాది.సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



## ఇచ్ఛాపురం సమస్యలు పరిష్కరించండి



**ఇచ్ఛాపురం ఏప్రిల్ 13 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ సమస్యల పరిష్కా ష్కారానికి పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను జనసేన నియోజకవర్గ నాయకులు దాసరి రాజు సోమవారం కలిశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయి పూర్తి చేయాలని, తలసేమియా బాధితులకు పింఛన్ కల్పించాలని, సోంపేటలో డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిస్కారం చేయాలని, కవిటి, సోంపేట మండలంలో అటవీ భూమిలో రహదారులు వేయుటకు త్వరగా సర్వే నిర్వహించి అనుమతులు ఇవ్వాలని కోరారు.సోంపేట పట్టణ మెయిన్ రోడ్ సమస్య త్వరగా పరిష్కరించాలని, ప్రత్యామ్నాయ రోడ్ కోసం ప్రణాళికలు చేయాలని కోరారు. నియోజకవర్గంలో శ్మశానవాటికలకు మౌలిక వసతుల కోసం వినతిపత్రం అందజేశారు.

## రైతులకు శిక్షణ




**సారవకోట, ఏప్రిల్ 14(వార్త):** గోపాలపురం గ్రామంలో ఆత్మ పథకం కింద రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి, చోడి, మొక్కజొన్న పంటలలో ఎరువుల వినియోగం, పురుగులు మరియు తెగుళ్ల నియంత్రణపై వివరంగా తెలియజేశారు. రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలను తెలుసుకుని వాటికి తగిన పరిష్కారాలను సూచించారు. జిల్లా వనరుల కేంద్రానికి చెందిన వ్యవసాయాధికారి శ్రీ వై. సురేష్ మాట్లాడుతూ, యూరియా అధికంగా వినియోగించడం వల్ల నేల నాణ్యత దెబ్బతింటుందని, దీని ప్రభావం దిగుబడిపై పడుతుందని హెచ్చరించారు. అలాగే పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి కలిగే నష్టాలను వివరించారు. అదేవిధంగా రైతులకు పి.ఎం.డి.ఎస్ పథకంపై అవగాహన కల్పించి, సుమారు 30 రకాల విత్తనాల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాలపై వివరించారు. పంటలను చీడపీడల నుంచి రక్షించేందుకు ఉపయోగించే రసాయనాలు, ద్రావణాల తయారీ విధానంపై ప్రదర్శన కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులకు పాంప్లెట్లు పంపిణీ చేయడంతో పాటు భూసార పరీక్ష ఫలితాలను అందజేశారు. వి.ఏ.ఏ జి. శరత్ కుమార్, గ్రామ పెద్దలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించి, దిగుబడులను మెరుగుపర్చే దిశగా కీలక సూచనలు అందించబడినట్లు అధికారులు తెలిపారు.

## సారాతో ముగ్గురి అరెస్టు



**సోంపేట ఏప్రిల్ 13 (వార్త):** సోంపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ చోట్ల నిర్వహించిన దాడుల్లో సారా ప్యాకెట్లు విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ కు విధించినట్లు సోంపేటఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. ఒడిస్సా తూటుపురం నుంచి 300 ప్యాకెట్లను ద్విచక్ర వాహనంపై రవాణా చేస్తుండగా పులక పుట్టుక గ్రామానికి చెందిన పులక లక్ష్మణరావును అరెస్ట్ చేసి సారా స్వాధీనం చేసుకున్నట్లు, ద్విచక్ర వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు. కంచిలి మండలం ఎమ్మెస్ పల్లి గ్రామంలో సారా అమ్ముతున్న రత్నాల హేమలత, బొండాడ మోహన్‌రావు నుంచి 100 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని వారిపై కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ముగ్గురికి 14 రోజుల పాటు మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

## న్యాయవాదులపై దాడులు అరికట్టాలి



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13(వార్త):** ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడానికి ప్రత్యేకంగా రక్షణ చట్టం తేవాలిన అవసరం ఎంతైనా ఉందని ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు నందికి రమణయ్య రెడ్డి అన్నారు.అన్నమయ్య జిల్లాలో యువ న్యాయవాది పూజారి ఎల్లయ్య పై కొంతమంది దుండగులు వెంబడించి అతి దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సోమవారం ఇచ్ఛాపురం న్యాయవాదులు బార్ హాల్ లో సమావేశం అయ్యారు. సోమవారం నాడు కోర్టు విధులకు గైర్హాజరు అవ్వాలని నిర్ణయించారు. ఇటువంటి దారుణాల్ని పాల్పలడిన వారందరికీ కఠినంగా శిక్ష వెయ్యాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ప్రేమలత పట్నాయక్, జాయింట్ సెక్రటరీ దక్కత కృష్ణ మూర్తి రెడ్డి, ట్రెజరర్ రేవాడ దేవరాజ్ రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు గిన్ని సీతయ్య రెడ్డి, ఎ.సత్యనారాయణ, రంగారావు, ఎ. బైరాగి రెడ్డి, ప్రసాద్ రెడ్డి, యం. రాజేంద్ర ప్రసాద్, సంతోష్ కుమార్ సాహు, యస్. యల్. నారాయణ, మురళి, ,గోవింద్, జగ్గారావు, మనోజ్ కుమార్ సా మంతో, కాళీ ప్రసాద్ పాల్గొన్నారు.

## వరిలో ఎరువుల యాజమాన్యంపై ఆర్పీఎల్ శిక్షణ

**జలుమూరు, ఏప్రిల్ 13 (వార్త):** కరవంజి గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్పీఎల్ శిక్షణ నిర్వహించారు. నరసన్నపేట వ్యవసాయ శాఖ ఏడీ ఎల్.వి. మధు రైతులకు మార్గదర్శనం చేశారు. వరి పంటలో సరైన ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు పెరగడమే కాకుండా సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. అలాగే నేల ఆరోగ్యం మెరుగుపడటంతో భవిష్యత్ పంటలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఎరువుల వినియోగంలో సమతుల్యత అవసరమని, అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, స్థానిక రైతులు పాల్గొని శిక్షణను ఆసక్తిగా విన్నారు. ఆర్పీఎల్ శిక్షణ ద్వారా రైతుల్లో శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించి, ఉత్పాదకతను మెరుగుపర్చే దిశగా వ్యవసాయ శాఖ కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.




## విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిన ప్రభుత్వం

**కొత్తూరు, ఏప్రిల్ 13(వార్త):** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీకి ప్రభుత్వం పరోక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలలు నిర్దేశిత సమయం లోగా ఫీజులు చెల్లించకపోతే వడ్డీ వసూలు చేసే కొత్త విధానానికి తెరలేపడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఫీజుల కోసం ఒత్తిడి చేయడం, ఆలస్యమైతే వడ్డీ విధిస్తామని చెప్పడం పేద, మధ్యతరగతి తల్లిదండ్రులపై పెనుభారం మోపడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రైవేట్ యూనివర్సిటీల చట్ట సవరణ ద్వారా కన్వీనర్ కోటాను కేవలం 30 శాతానికే పరిమితం చేయడం వల్ల పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడమే కాకుండా, ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన వంటి పథకాలతో విద్యార్థులకు అండగా నిలిచామని ఆమె గుర్తు చేశారు. కానీ నేడు ఆ పథకాలన్నీ నిలిచిపోయాయని, మెడికల్ కాలేజీలను సైతం అమ్మేసే పరిస్థితికి ప్రభుత్వం దిగజారిందని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి కుంటుపడి, తిరోగమనం కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్ల ఊసే లేదని, ప్రతి పంచాయతీలో పదుల సంఖ్యలో అర్హులైన వితంతు మహిళలు పింఛన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని, వారి పరిస్థితి ఈ ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి గారి హయాంలో అమ్మఒడి, వైఎస్ఆర్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలతో మహిళా సాధికారతకు బాటలు పడ్డాయని, నేడు ఆ పథకాల అమలు సక్రమంగా లేక మహిళలు మళ్లీ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని రెడ్డి శాంతి పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు, మహిళల పేరుతో ఇళ్ల పట్టాల వంటి విప్లవాత్మక నిర్ణయాలు జగన్ పాలనలోనే సాధ్యమయ్యాయని కొనియాడారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో అసాధ్యమైన హామీలిచ్చి ఇప్పుడు కాలయాపన చేయడం తగదని, ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు మానుకుని తక్షణమే అర్హులైన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయల సాయాన్ని అందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీలకు గత ప్రభుత్వం ఇచ్చిన భరోసా నేడు కరువైందని, ప్రజల మరియు మహిళల హక్కుల కోసం వైఎస్ఆర్సీపీ నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.



## శ్రీముఖలింగంలో నిత్యాన్నదానానికి శ్రీకారం



**జలుమూరు, ఏప్రిల్ 13 (వార్త):** ఏకాదశి పర్వదినమైన సోమవారం సందర్భంగా శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తి, సేవాభావం ఉట్టిపడింది. ఎల్.ఎన్.పేటకు చెందిన ప్రసాద్ పాణిగ్రహి భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. ఏకాదశి సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, దర్శనాలు నిర్వహించబడగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వాతావరణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఈ సందర్భంగా ప్రసాద్ పాణిగ్రహి మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సానుకూల భావాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆలయ ఈవో ఏడుకొండలు, ఎండోమెంట్ అధికారులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ప్రతిరోజూ నిత్య అన్నదానం నిర్వహించేందుకు భక్తులు ముందుకు రావాలని కోరారు. దాతలు ఎవరైనా వస్తు రూపంలో గానీ, ధన రూపంలో గానీ విరాళాలు ఇవ్వాలనుకుంటే, తప్పనిసరిగా ఈవోను సంప్రదించాలని సూచించారు. భక్తులు ఇచ్చే మొక్కులు, ముడుపులు తప్పనిసరిగా రసీదు తీసుకుని తమ పేరుమీద సమర్పించాలని కోరారు. అర్చకులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు లేదా ఇతరుల చేతికి నేరుగా డబ్బులు ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు తమకు తోచిన మేర సహాయం చేయాలని గ్రామ మాజీ ఉప సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

## పలాసలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్మించాలి

**పలాస, ఏప్రిల్ 13 (వార్త):** పలాస నియోజకవర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొత్త భవనామ త్వరిత గతిన నిర్మాణం చేపట్టాలని బార్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే గౌతు శిరీషని కోరారు. సోమవారం న్యాయవాదులు కలిసికట్టుగా ఎమ్మెల్యేతో బేటీ అయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ విషయమై గతంలో 08-05-2025 తేదీన లేఖ ద్వారా రాష్ట్ర న్యాయశాఖ మంత్రిని కోరడం జరిగిందని పేర్కొన్నారు. 1987--88 సంవత్సరాల్లో నిర్మించిన పాత కోర్టు భవనం కాలక్రమేణా బలహీనంగా మారి వినియోగానికి అనర్హంగా మారడంతో దాన్ని కూల్చివేసారు. అప్పటి నుంచి కోర్టు అద్దె భవనంలో పనిచేస్తుండటంతో న్యాయవాదులు, సిబ్బంది, వాదివాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె అన్నారు. స్థలాభావం, సరైన సౌకర్యాల లేమి కారణంగా కోర్టు కార్యకలాపాలు కూడా ప్రభావితమవుతున్నాయని తెలిపారు. కొత్త కోర్టు భవన నిర్మాణానికి పరిపాలనా అనుమతులు, అంచనాలు, టెండర్ ప్రక్రియలు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని తెలియజేశారు. ఈ ఆలస్యం న్యాయవర్గం, ప్రజలకు నిరంతర ఇబ్బందులు కలిగిస్తున్నదని చెప్పారు. త్వరలో మంత్రికి మరోసారి లేఖ ద్వారా కోరుతామని, త్వరలో భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కలిసిన వారిలో పలాస బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.



## కట్టె జనుముకు నష్టపరిహారం

**సోంపేట, ఏప్రిల్ 13(వార్త):** రబి సీజన్లో ఈ ప్రాంతంలో సాగు చేసిన టమాటా తో పాటు కట్టెను పంట కూడా ఇటీవల కురిసిన భారీ వర్షానికి చాలావరకు నష్టం వాటిల్ని సంగతి తెలిసిందే. ఈ విషయంలో ఉద్యాన శాఖ వ్యవసాయ శాఖ అధికారులు ముందుగా కేవలం టమాటా పంట నష్టాన్ని మాత్రమే రైతుల వారీగా నమోదు చేశారు. బీసీ సంఘం అధ్యక్షులు బీన ఢిల్లీ రావు కట్ట జనుము మినుము పెసర పంటలను కూడా నమోదులో చేర్చాలని వాటికి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ నష్టపోయిన టమాటా పంటను పరిశీలించినప్పుడు ఢిల్లీలో స్వయంగా కలిసి మిగతా పంటలకు కూడా నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. కట్టి జన్మ విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా రైతుల పొంది ఉన్నారని ఇది చాలా విలువైన పంట అని పెట్టుబడి కష్టంతో కూడుకున్నదని ఎమ్మెల్యేకు వివరించగా ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భవానీ శంకర్రావు, అగ్రికల్చర్ ఆఫీసర్ నరసింహమూర్తి తమ సిబ్బందితో కలిసి కట్టె జనుము కూడా లెక్కలు సేకరించారు. దీని పట్ల బీనా ఢిల్లీ రావు అధికారులకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



## శక్తి యాప్‌పై అవగాహన



**కంచిలి, ఏప్రిల్ 13(వార్త):** పెద్ద శ్రీరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. శక్తి టీం ఇంచార్జ్ ఎస్ఐ బైరాగి వాసుదేవరావు మోహిని విద్యార్థులకు పోలీస్ చట్టాలపై ప్రాథమిక అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు భద్రత, హెల్మెట్ సురక్ష గూర్చి అవగాహన కల్పించారు. ప్రయాణ సమయంలో ఇతరులు ఇచ్చే వస్తువులు స్వీకరించవద్దని పేర్కొన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణాకు అపరిచితుల ప్రయత్నానికి లొంగవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి



**పలాస, ఏప్రిల్ 13 (వార్త):** గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో పాలనలో ఎటువంటి జాప్యం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశించారు. సోమవారం నియోజకవర్గ అధికారులతో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు లేని సమయంలో అధికారుల బాధ్యత మరింత పెరుగుతుందని గుర్తు చేశారు. ముఖ్యంగా వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని, వీధి దీపాలు, మురుగునీటి కాలువల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే వినతులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశం లో నియోజకవర్గం లోని ప్రత్యేక అధికారాలు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



**పలాస, ఏప్రిల్ 13 (వార్త):** చరిత్ర తెలియని వారు చరిత్ర సృష్టించలేరు అన్న బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రముఖ న్యాయవాది, పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ ( బాబా) అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా సోమవారం ఆయన ఒక ప్రకటన పలాసలో విడుదల చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే అందరం నేడు స్వేచ్ఛగా జీవిస్తున్నామని, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఒక్కరికి పేరుపేరునా అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. నేటి యువత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళుతూ కృషి చేయాలన్నారు. ప్రపంచ స్థితిగతులు అంబేద్కర్‌కి తెలుసునని, అందుకే ఆయనకు భారత రాజ్యాంగం రాసే బాధ్యత అప్పగించారన్నారు. భారతదేశ పునర్నిర్మాణ దృష్టిలో రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఆయన చెక్కిన రాజ్యాంగ శిల్పం లో ప్రపంచ మానవతా సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయని, లౌకిక భావన, ప్రజాస్వామ్య వ్యవస్థలలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాత్రత్వాలను దేశ ప్రజలకు లభించడానికి తీవ్రంగా కృషి చేశారన్నారు. ఆయన విశుద్ధంగా, నిర్మలంగా, ద్వేషరహితంగా జీవించారన్నారు. అజయ్ జీవన విధానం అందరికీ ఆచరణీయం. అంబేద్కర్ సిద్ధాంతాలైన కుల నిర్మూలన, అంటరానితనం నివారణ,ఆర్థిక సమానత్వం, మానవ హక్కులు, బహుజన సాధికారితలను సాధించడానికి ప్రస్తుత సమాజం ముందుకెళ్లవలసిన చారిత్రిక సందర్భం మన కర్తవ్యం అన్నారు.

## ఘనంగా కాళీ మాత ఆలయ ప్రారంభం

**ఇచ్ఛాపురం ఏప్రిల్ 13 (వార్త):** నీలాపుపుట్టుగ గ్రామంలో కాళీమాత ఆలయ ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్, ప్రేమ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. సిద్ధాంతులు గురువు నీలగిరి వాసుదేవు, శిష్యులు రామ కృష్ణ సిద్ధాంతి, ఎస్పి శ్యామ్‌సుందర్ , నారాయణ పాడి సిద్ధాంతులు ఆధ్వర్యంలో మహా యజ్ఞం , హరే రామ హరే కృష్ణ సహిత నగర సంకీర్తన, నారాయణ సేవలో పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం వారిని గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, పెద్దలు, కాళీమాత భక్తులు నీలాపుపుట్టుగ గ్రామ ప్రజలు, యువత, మహిళలు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546